

నేడు ప్రజా ఫిర్యాదులు స్వీకరణ

ప్రజాశక్తి - కడప : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ను సోమవారం సభాభవనంలో నిర్వహిస్తున్నట్లు డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయంలో కూడా సమర్పించుకోవచ్చునని తెలిపారు. డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి 10.00 గంటల వరకు ఉంటుందన్నారు ప్రజలు 08562-2444 37 ల్యాండ్ లైన్ నెంబరు కు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునని పేర్కొన్నారు.ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కడప 'ఉక్కు'ను విస్మరించడం దారుణం



కడప అర్బన్ : బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

కేంద్ర బడ్జెట్ లో కడప ఉక్కు'కు తీరని అన్యాయం జరిగిందని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరబల్ల శివకుమార్ తెలిపారు. ఆదివారం కడప ఉక్కుకు నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా శివ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతి బడ్జెట్‌లో కడప ఉక్కును అన్యాయం చేస్తూనే ఉందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో విభజన హామీలను, కడప ఉక్కు ఊసే లేదన్నారు. ఈ ప్రాంత ప్రజానీకాన్ని మోసం చేయడమే అన్నారు. చట్టబద్ధంగా రావసున్న కడప ఉక్కుకు నిధులు కేటాయించకపోవడానికి కారణం ఏమిటని ప్రశ్నించారు. కడప ఉక్కు వస్తే వేల మంది చదువుకున్న నిరుద్యోగులకు ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొన్నారు. తద్వారా రాయలసీమలో కరువు నివారణలో యువకుల ఉపాధి లభించి ఊరట కలిగిస్తుందని తెలిపారు. ఇది ఆంధ్రుల ఆత్మగౌరవానికి సంబంధించిన విషయమని చెప్పారు. కడప ఉక్కు ఆంధ్రుల హక్కు అన్నారు. కడప ఉక్కు విషయంలో రాష్ట్ర ఎంపీలు నోరు మెదపకపోవడం దీనికి నిదర్శనం అన్నారు. కేవలం ఎన్నికల సమయంలోనే కడప ఉక్కు స్మరిస్తూ తర్వాత విస్మరిస్తూ ఉండటం ఇంకెన్నాళ్లు అన్నారు. ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో అయిన రాష్ట్ర ఎంపీ లు రాష్ట్రానికి,రాయలసీమకు జరుగుతున్న అన్యాయాన్ని తెలియజేసి, కేంద్రాన్ని నిలదీసి నిధులు రాబట్టాలని కోరారు. లేకుంటే ప్రజలలో చరిత్ర హీనులుగా మిగులుతారన్నారు. కడప ఉక్కు కోసం డివైఎఫ్ఐ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని నినదించిన నాడు సంధించిన స్ఫూర్తిని తీసుకుని కడప ఉక్కు ఆంధ్రుల హక్కుగా నినదించి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమించి సాధిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బా.నరసింహులు, నగర కార్యదర్శి విజయ్,నాయకులు సురేష్, రాజు, సుధీర్ పాల్గొన్నారు.



బద్వేల్‌లో అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలియజేస్తున్న సిపిఎం నాయకులు

బద్వేలు : కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం బద్వేల్ పట్టణ కమిటీ సభ్యుడు ముడియం చిన్ని మాట్లాడుతూ ఁంద్ర బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రం మళ్లీ మొండి చేయి చూపించిందని పేర్కొన్నారు. ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ, విభజన హామీలను పక్కన పెట్టిందని చెప్పారు. విభజన చట్టం ప్రకారం వచ్చిన ఏ జాతీయ విద్యా సంస్థకు నిధులు కేటాయించలేదని, విశాఖ రైల్వే జోన్, ఎస్ఐటి, ఐఐటి, ఐఐఎం, త్రిపుల్ ఐటి, ఐఐఎస్ఇఆర్, గిరిజన యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీ, దుగరాజపట్నం పోర్టు ,కడప స్టీల్ ప్లాంటు, విశాఖ మెట్రో, ఎయిమ్స్, వెనుకబడిన జిల్లాల అభివృద్ధి నిధులు, రాజధాని నిర్మాణానికి నిధుల ఊసే లేదని వాపోయారు. ఈ దగా కోరు ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను రాష్ట్ర ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. నిరసన కార్యక్రమంలో సిపిఎం బద్వేల్ పట్టణ కమిటీ సభ్యులు సగిలి రాయప్ప,చెప్పలి సుబ్బారాయుడు,గంప అనంతమ్మ, 'షేక్ బ్రైరూన్‌బీ పట్టణ నాయకులు నాగార్జున, ఆదిల్, బాలగురువయ్య ,నరసింహారత్నమ్మ, పాతిమా, ఓబయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అట్లూరు : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ల కోసమేనని సిపిఎం నాయకులు పి. చాంద్‌బాషా, రమణ పేర్కొన్నారు. బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ మండల కేంద్రంలో ఆదివారం కేంద్ర బడ్జెట్ పత్రాలను సిపిఎం ఆధ్వర్యంలో దహనం చేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం బడ్జెట్‌తో పోలిస్తే రూ. 48 లక్షల కోట్ల బడ్జెట్ పెట్టారని, రూ. ఏడు లక్షల కోట్లకు సవరించారని చెప్పారు. ప్రతి పద్దుకూ ఐదు శాతం కేటాయింపులు పెరిగితే.. పోయిన సారి కేటాయింపులతో సమానంగా ఉంటుందని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీకి అంబానీ, అదానీ, కార్పొరేట్లకు ఉపాధి కల్పించేలా బడ్జెట్‌ను రూపకల్పన చేశారని వాపోయారు. ఆహారభద్రతకు ఎక్కువ నిధులు కేటాయించలేదన్నారు. రేషన్ కార్డులను మోడీ ప్రభుత్వం క్రమంగా తగ్గిస్తూ వస్తోందని వాపోయారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు లత, వెంకటయ్య, రవిచంద్ర, నిత్య రామాంజనేయులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో కడప ఉక్కుకు నిధులు కేటాయించకపోవడంతో కడప ఉక్కు పై కేంద్రానికి వున్న చిత్తశుద్ధి అర్థం అవుతుందని డివైఎఫ్ ఐ జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్ తెలిపారు. ఆదివారం స్థానిక స్థానిక కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు విభజన హామీలో భాగంగా వున్నటువంటి కడప ఉక్కు గడిచిన ఇన్ని సంవత్సరాలలో బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని కనీసం ఈ సారి అయినా కేంద్ర బడ్జెట్ లో కడప ఉక్కు కు నిధులు ఇస్తారేమో నని రాష్ట్ర ప్రజానీకం, అలాగే రాయలసీమ, కడప జిల్లా ప్రజానీకం ఆశగా ఎదురుచూసే వారికి కేంద్రం మరోమారు మొండిచేయి చూపించిందని అన్నారు. రాయలసీమ ప్రాంతానికి సంజీవని అయిన కడప ఉక్కు పై కేంద్రం వివక్షత చూపడం దారుణం అన్నారు. రాష్ట్ర ఎంపీ లకు అధికార, ప్రతిపక్షాల పార్టీలకు చిత్తశుద్ధి ఉంటే పార్లమెంటు సమావేశాలలో కడప ఉక్కు కు నిధులు రాబట్టాలని అన్నారు. సమావేశంలో నాయకులు సురేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

వేంపల్లి : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కడప జిల్లాకు, రాయల సీమకు, రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి నిరసనగా కాంగ్రెస్ నేతలు నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు ఆదివారం వేంపల్లెలో పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు నల్ల బ్యాడ్జీలను పెట్టుకొని నల్ల జెండాలతో నిరసన దీక్ష చేశారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ గతంలో జరిగినట్లే ఈ సారి కూడా కేంద్ర బడ్జెట్‌లో కడప జిల్లాకు, రాయల సీమకు, ఆంధ్రప్రదేశ్ కు తీరని అన్యాయం జరి గిందని ఆవేదన వ్యక్తం చేశారు. విభజన చట్టంలోని 13 వ షెడ్యూల్ ప్రకారం కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ నిర్మాణం జరగాలని ప్రకారం. అయినా నిర్మాణానికి నోచుకోలేదని చెప్పారు. నిరసనలో కాంగ్రెస్ నాయకులు రామాంజనేయరెడ్డి, ఉత్తన్న, బద్రినాథ్, వెంకటేష్, మహబూబ్ బాషా, రవి, వినయ్, రమణ, సాయి, శ్యాం, దిలీప్, కిరణ్, విజయ్, పాపయ్య పాల్గొన్నారు.



వేంపల్లి : నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెరగాలి

- నోబుల్ ప్రైజ్ సాధించే స్థాయికి ఎదగాలి
- వైవీయూ విసి కృష్ణారెడ్డి
- పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు
- ముగిసిన కడప బాలోత్సవం



విజేతలకు బహుహతులు ప్రదానం చేస్తున్న విసి

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని సెయింట్ జోసెఫ్ బాలుర పాఠశాలలో ఈ నెల 1,2 తేదీల్లో నిర్వహించిన కడప బాలోత్సవం-2 పిల్లల పండగ ఉత్సాహంగా...ఉల్లాసంగా ముగిసింది. మొదటి రోజు వెయ్యి మంది, రెండవ రోజు 1,970 మంది విద్యార్థులు వివిధ పోటీల్లో భాగస్వాములయ్యారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు బాలోత్సవం కమిటీ వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, తెలుగు కథా రచన, చిత్రలేఖనం, మట్టితో బొమ్మలు, మ్యాప్, దినపత్రికా పఠనం పోటీలు జూనియర్స్, సీనియర్స్, సబ్ జూనియర్స్ గా విభజించి పోటీలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రతి ఒక్కరిని ఆకట్టుకున్నాయి. యువత వ్యసనాలకు బానిసలై వారి బంగారు భవిష్యత్తును ఎలా నాశనం చేసుకుంటున్నారో నాటిక రూపంలో సిద్దవటం నలందా స్కూల్ విద్యార్థులు కళ్లకు కట్టినట్లు చూపించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు వ్యక్తిగతంగా, గ్రూప్‌లుగా ముఖ్యఅతిథుల చేతుల మీదుగా మెమొంటోలు, సర్టిఫికెట్స్ అందించారు. యాకరింగ్, వాలంటీలర్లుగా పని చేసిన ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు రాహుల్, రవి, విజయ్, ఉదయ్‌కి మెమెంటోలు అందించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన వైవీయూ విసి ఆచార్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ గమ్యాన్ని తల్లిదండ్రుల ద్వారా నిర్ణయి ంచుకుంటారని పేర్కొన్నారు. పెంపకంలో లోపం కనిపిస్తుందని చెప్పారు. విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారే తప్ప నోబెల్ ప్రైజ్ వచ్చే స్థాయిలో కష్టపడక పోవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. దేశ జిడిపి పెరగాల్సి ఉందని తెలిపారు. విద్యతో పాటు ఇతర కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం ముఖ్యమని పేర్కొన్నారు. కడప బాలోత్సవం కమిటీ నిర్వహణ తీరు అభినందనీమయని చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన కమిటీ అధ్యక్షులు గోపాల్ మాట్లాడుతూ అందరి సహారంలో ఇంతటి కార్యక్రమం నిర్వహించామని పేర్కొన్నారు. డాక్టర్ జగదీశ్వరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. విద్యావేత్త గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో నిర్వహించే బాలోత్సవానికి అవసరమైన భోజన సౌకర్యం తానే కల్పిస్తానని హామీ ఇచ్చారు. గౌరవాధ్యక్షులు నాగముని రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ దాతల సహకారంతో రెండురోజుల బాలోత్సవం దిగ్విజయంగా పూర్తి చేసుకున్నామని చెప్పారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎస్.వి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వీర సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యాతో పాటు కరికులం, కో-కరికకులంలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. విద్య ఒక్కటే ప్రస్తుత పరస్థితుల్లో విద్యార్థులకు సరిపోదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రచార కార్యదర్శి శివరాం, కల్చలర్ కన్వీనర్ వెంకటసుబ్బయ్య, అడకమిక్ కన్వీనర్ మహేష్, గోపి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థుల నృత్యాలు

విద్యార్థుల ప్రతిభను వెలికితీయాలి

గౌరవ సలహాదారు డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు ఘనంగా ఏకలవ్య ఫౌండేషన్ ప్రేరణ

ప్రజాశక్తి- కడప అర్బన్

విద్యార్థుల ప్రతిభను వెలికి తీయాలని ఏకలవ్య ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకలవ్య ఫౌండేషన్ గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల ప్రతిభా పాటవాలను వెలికి తీసి, వారి నైపుణ్యాలను పదును పెట్టి తద్వారా సమాజానికి ఉపయోగపడే మంచి పౌరులుగా తీర్చి దిద్దడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. విద్యాశాఖ కార్యాలయ సహాయ సంచాలకులు మునీర్ అహ్మద్ మాట్లాడుతూ ప్రతినెలా ఆయా ప్రధానోపాధ్యాయులు, గైడ్ ఉపాధ్యాయుల సహకారంతో ఒక సహపాఠ్య కార్యక్రమం నిర్వహించి,బహుమతులు అందజేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కడప మండల విద్యాశాఖాధికారి గంగిరెడ్డి సంస్థ భవిష్యత్ లో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. నాగార్జున కళాశాల డైరక్టర్ శివవిష్ణు మోహన్ రెడ్డి, సంస్థ ట్రస్టీ చలపతి, విద్యాకమిటీ ఛైర్మన్ బాలకృష్ణ, కడప ఇన్‌ఛార్జి ప్రశాంత్, ప్రాజెక్టు మేనేజర్ ఎన్విత, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లి తండ్రులు, సంస్థబోధకులు, పిల్లలు పాల్గొన్నారు. జిల్లా స్థాయి క్విజ్ పోటీలో గెలుపొందిన పిల్లలకు బహుమతులు అతిథుల చేతుల మీదుగా అందజేశారు. సమారు 150 మంది ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, దాతలకు అతిథులచే మోమెంటోలు అందజేసి సన్మానించారు. అప్పరాజపల్లె చిన్నారులు కోళాటం, లఘు నాటిక ప్రదర్శనలతో అలరించారు.



బిల్లుల చెల్లింపుపై అవగాహన కల్పిస్తున్న విద్యుత్ ఎస్ఇ రమణ

క్యూఆర్ కోడ్‌తో విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

ప్రజాశక్తి - కడప

క్యూఆర్ కోడ్ ద్వారా సులభతరంగా, సమర్థవంతంగా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.రమణ అన్నారు. ఆదివారం విద్యుత్ ఎస్ఇ కడపలోని నెహ్రూ నగర్‌లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. క్యూఆర్ కోడ్ ద్వారా ఏవిధంగా బిల్లులు చెల్లించవచ్చో వినియోగదారులకు అవగాహన కల్పించారు. విద్యుత్ బిల్లులకు సంబంధించి డిమాండ్ నోటీసు కింద భాగంలో క్యూఆర్ కోడ్ ఉంటుంది అని తెలిపారు. ఈ క్యూఆర్ కోడ్‌ని పేమెంట్ యాప్‌ల ద్వారా స్కాన్ చేసిన వెంటనే బిల్లుకు సంబంధించి అమౌంటు సంబంధిత 13 అంకెల విద్యుత్ సర్వీస్ నెంబరు యాప్‌లో కనిపిస్తుంది అన్నారు. దీనిని నిర్ధారణ చేసుకొని బిల్లులు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

గోల్డ్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి - కడప : కడప నగరంలోని అమ్మవారి శాల వీధిలో రాయల్ నిషా వన్ గ్రామ్ గోల్డ్ షోరూంను ఆదివారం మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్. బి.అంజాద్‌బాషా ప్రారం భించారు. వ్యాపార రంగంలో ఉన్న స్థాయికి ఎదగాలంటే నాణ్యత పాటించాలని సూచి ంచారు. కార్యక్రమంలో సీని యర్ నాయకులు సుభాన్ బాష, కార్పొరేటర్లు మక్బూల్, లక్ష్మయ్య, అజ్మతుల్లా, అలీ అక్బర్,షంషీర్ మహమ్మద్ షఫీ, చాక్లెట్ గౌస్, జిలాన్, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ తోటా కృష్ణ, నార్త్ జోన్ అధ్యక్షులు బి. హెచ్ ఇలియాస్, నాయకులు పవర్ అల్తాఫ్,ఆన్సర్, గయాజ్, ఇబ్రహీం మి యా, ఉస్మాన్, ఆరిఫ్ సమీర్, రిజ్వాన్, మున్నా, సలీం సాహెబ్, హబీబ్ సాహె బ్, ఫారూఖ్ ,రఫీ ,షఫీ, సత్తార్, ముద్ద సార్, ఇలియాజ్, షేరు పాల్గొన్నారు.

ఉనికి కోసమే ఫీజు పోరు

ప్రజాశక్తి - కడప అర్బన్ : గత ప్రభుత్వంలో డిగ్రీ, పీజీ విద్యార్థులను దగా చేసి తాను పెట్టిన బకాయిలపై తానే ఆందోళనకు పిలుపునివ్వడం హాస్యాస్పదంగా ఉందని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్ పేర్కొన్నారు. ఆదివారం కడప ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల పైన వైసిపి నాయకులు ఆందోళనలకు పిలుపునివ్వడం చూస్తా ఉంటే దొంగే దొంగ అని అరచినట్లు ఉందని ఎద్దేవ చేశారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టింది జగనే అని, తాను పెట్టిన బకాయిలపై తానే ఆందోళనలకు పిలుపునివ్వడం సిగ్గుచేటన్నారు. వైసిపి నాయకులు ఉనికి కోసం పేటీఎం బ్యాచ్‌ని కలుపుకుని దొంగ పోరు చేస్తే ప్రజలు, విద్యార్థులు నమ్మడానికి సిద్ధంగా లేరన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-అట్లూరు : మండలంలోని అట్లూరు క్రాస్ రోడ్డు రెడ్డి మెడికల్ స్టోర్ వద్ద ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష ఆదరణ లభించింది. మండలంలోని పలు గ్రామాలలో నుంచి సుమారు 150 మంది కంటి చూపు లోపాలపై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఎస్‌బిఐ సౌజన్యంతో కడప పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్య నిపుణులు శివకృష్ణ, సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పల్లెం శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

పచ్చదనం పెంపునకు పెద్దపీట

- 33 లక్షల మొక్కల పంపిణీకి కసరత్తు
- 92 వేల ఉపాధి పనుల కల్పనే లక్ష్యం
- సోషల్ ఫారెస్ట్ డిఎఫ్ఒ ఎం.శివకుమార్



ముఖా ముఖి..

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో గ్రీనరీ అభివృద్ధికి పెద్దపీట వేశాం. జిల్లాలో 33 శాతం మొక్కల పెంపకం ద్వారానే పర్యావరణ సమతుల్యత సాధ్యం. ఇటు వంటి పరిస్థితుల నేపథ్యంలో జిల్లా సామాజిక అటవీశాఖ 50 శాతం మేరకు పచ్చదనాన్ని అభివృద్ధి పరచాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతోంది. డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ కమిటీ ఛైర్మన్ కలెక్టర్ నిర్దేశించిన మేరకు 33 లక్షల మొక్కలు పెంపకంపై దృష్టి సారించాం. దీనికి అదనంగా కేంద్రప్రభుత్వ పథకమైన కంఫా కింద 1.60 మొక్కల పెంపకాన్ని చేపట్టాం. జిల్లాలోని ఎనిమిది నర్సరీల్లో పెంచిన మొక్కలను పొలాల హద్దులు, గెట్లతోపాటు పాఠశాలలు, కళాశాలలు, అడవుల్లో పొంటే షన్‌లు, ప్రభుత్వసంస్థలు, సామాజిక సంస్థలకు పంపిణీ చేస్తామని పేర్కొంటున్న సోషల్ ఫారెస్ట్ డిఎఫ్ఒ ఎం.శివకుమార్‌తో ముఖాముఖి..

ఈ ఏడాది మొక్కల పెంపకం లక్ష్యమెంత?

ఈ ఏడాది జిల్లా అటవీ కమిటీ ఛైర్మన్ కలెక్టర్ నిర్దేశించిన మేరకు 33 లక్షల మొక్కలను పెంచుతున్నాం. వీటికితోపాటు కేంద్ర ప్రభుత్వ పథకమైన కంఫా కింద 1.60 మొక్కలను పెంచడంపై దృష్టి కేంద్రీకరించాం.

జిల్లాలోని నర్సరీల సంఖ్య ఎంత?

జిల్లాలో ఎనిమిది నర్సరీలు ఉన్నాయి. అవి కడప నగర శివారులోని బుగ్గడ్యామ్, మద్దిమడుగు, కమలాపురం, కొండూరు, ప్రొద్దుటూరు, మైదుకూరు, వేంపల్లి, జమ్మలమడుగు ప్రాంతాల్లో నర్స రీలు ఉన్నాయి.

మొక్కల పెంపకానికి కేటాయింపుల గురించి తెలపండి?

ఉపాధి హామీ నిధుల సహాయంతో మొక్కల పెంపకానికి వేజ్ కాంపొనెంట్ కింద రూ.2.78 కోట్లు, మెటీరియల్ కాంపొనెంట్ కింద కేటాయించడమైంది. ఇందులోభాగంగా 92 వేల ఉపాధి పని దినాల్ని కల్పిస్తాం.

నర్సరీలోని మొక్కల రకాలెన్ని?

జిల్లాలోని ఎనిమిది నర్సరీల్లో టేకు, ఎర్రచందనం, రోజ్ వుడ్, నెమలిరానా, నిద్రగన్నేరు, కదంబ, వేప, కానుగ, వెదురు, జామ, దానిమ్మ, మునగ, కరివేపాకు వంటి పలు రకాల మొక్కలను పెంచడం జరుగుతోంది.

మొక్కల పంపిణీ గురించి తెలపండి?

జిల్లాలో ప్రభుత్వరంగ సంస్థలైన పాఠశాలలు, కళాశాలలకు ఉచితంగా పంపిణీ చేస్తాం. కేంద్రప్రభుత్వ పథకమైన ఏక్‌ఫెయిడ్ మాకే నామ్‌లో భాగంగా ఉచితంగా మొక్కలను పంపిణీ చేయడం జరుగుతోంది. గ్రీనరీ పెంపకంలో భాగంగా టెర్రిటోరియల్ ఫారెస్ట్ డిపార్టుమెంట్ సైతం మొక్కలను నాటడానికి చర్యలు తీసుకుంటోంది.

నర్సరీల్లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చర్యలేమిటి?

నర్సరీల పరిరక్షణకు మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టాం. ఇందులోభాగంగా రూ.20 లక్షలతో కూడిన ప్రతిపాదనలు పంపించడమైంది. ఇందులో వాటర్‌ట్యాంకులు, నర్సరీలకు ఫెన్సింగ్, గేట్లు, పెండింగు బిల్లులను చెల్లింపులకు వినియోగించడం జరుగుతుంది.

నర్సరీల నిర్వహణకు సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

నర్సరీల నిర్వహణకు సిబ్బంది కొరత ఉన్నమాట వాస్తవమే. జిల్లాలోని నర్సరీల నిర్వహణలో సహకారానికి ఇద్దరు రేంజర్ స్థాయి అధికారులు ఉన్నారు. వీరిలో ఒకరు త్వరలో రిటైర్డు అవుతున్నారు. ఆయన స్థానం ఖాళీగా ఉండనుంది. వీరితోపాటు అదనపు సిబ్బందిని నియమించుకుంటే లక్ష్యాన్ని సులువుగా చేరుకునే అవకాశం ఉంటుంది.

కలకలం రేపుతున్న మహిళల హత్యలు

సింహాద్రిపురంలో వృద్ధురాలు , వేములలో మహిళ వరుస హత్యలతో ఆందోళన చెందుతున్న ప్రజలు

ఇటీవల మహిళల హత్యలు ఆయా మండలాల్లో కలకలం రేపుతున్నాయి. సింహాద్రిపురం మండలంలో వృద్ధురాలిని, వేముల మండలంలో 50 ఏళ్ల మహిళను దారుణంగా హత్య చేశారు. రెండు హత్యల్లో ఒకటి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ హత్య పాత గొడవలు కారణంగా జరిగినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మరో మహిళ గేదెలు మోపుతుండగా బంగారు కోసం దొంగలు హత్య చేసి ఉంటారని పోలీసులు పేర్కొంటున్నారు. ఈ హత్యలతో రెండు మండలాల్లోని మృతుల గ్రామాల్లో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.



వృద్ధురాలి హత్యపై స్థానికులను విచారిస్తున్న డిఎస్‌పి, సిఐ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని బిదినంచర్లలో పార్వతమ్మ (80) హత్యకు గురయ్యారు. శనివారం ఆమె రాత్రి ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో సమీపంలోని వారు అనంతపురంలోని తమ కుమారులకు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు తాళాలు పగలగొట్టి ఇంటిలోకి వెళ్లి చూడగా మృతురాలు హత్యకు గురైనట్లు గుర్తించారు. వారం రోజుల కిందట చంపి బయట తాళాలు వేసినట్లు తెలుస్తుంది. మృతురాలు శరీరంపై గాయాలు ఉండడంతో పాటు మెడకు ఇనుప గొలుసు వేసి హత్యగా చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతురాలకు ఇద్దరు కుమారులు ఉండగా వారి ఇరువురూ అనంతపురంలో నివాసం ఉంటున్నారు. భర్త చాలా ఏళ్ల కిందట మృతి చెందారు .

మృతిపై పలు అనుమానాలు ..

మృతురాలు పార్వతమ్మ మృతిపై పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ముఖ్యంగా తమ ఇంటి సమీపంలోని పుల్లారెడ్డి, కార్తికేయ రెడ్డితో తరచూ గొడవ పడుతుండదని తెలిసింది. దీంతో పలుమార్లు పోలీస్‌స్టేషన్లో సైతం ఆమె ఫిర్యాదు చేశారు. దీంతోపాటు పార్వతమ్మ ఇంటి సమీపంలో బెల్ట్ షాప్ సైతం నిర్వహించే వారిని దీని కారణంగా పలుమార్లు గొడవ దిగినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డిఎస్‌పి

మృతురాల హత్య జరిగిన ప్రదేశాన్ని పులివెందుల డిఎస్‌పి మురళీనాయక్, రూరల్ సిఐ వెంకటరమణ పరిశీలించారు. మృతికి గల కారణాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డాగ్ , క్లూస్ టీంతో పరిశీలన చేయించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ తులసి నాగప్రసాద్ పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య

వేముల : మండలంలోని కె. కె. కొట్టాల గ్రామానికి చెందిన సింగంశెట్టి పద్మావతి(50)దారుణ హత్య గురైంది. మృతురాలి భర్త సుబ్బారాయుడు తెలిపిన వివరాల మేరకు.. సింగంశెట్టి పద్మావతి ఆదివారం ఉదయం 10 గంటలకు సమయంలో గేదెలను మేత కోసం సమీపంలోని కొండల్లోకి వెళ్లింది. మధ్యాహ్నం సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తి ఆ కొండ సమీపంలోని తోటలో మోటార్ స్టార్టర్ దొంగతనానికి వచ్చాడు. ఆ దొంగను చూసి అదే ప్రాంతంలో మరో మహిళ గట్టిగా కేకలు వేయడంతో కొండ ప్రాంతంలోకి వెళ్లాడు. అక్కడే పద్మావతి గేదెలను మేపుతుండగా ఆ వ్యక్తి ఆమె మెడలోని గొలుసు, కమ్మలు చోరీ చేయడంతో బండరాయితో హత్య చేశాడు. ఆమె భర్త అనుమానం వచ్చి చూడదా కొండ కింద ప్రాంతంలో తీవ్ర గాయాలతో చనిపోయి ఉందని చెప్పారు. మృతురాలి మెడపై, తలపై గాయాలున్నాయి. మెడలోని గొలుసు, కమ్మలు, ఉంగరం లేవని ఎవరో గుర్తుతెలియని వ్యక్తి మహిళపై దాడి చేసి ఆమె ఒంటి మీద ఉన్న నగలను దొంగలిచారని అనుమాన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న సిఐఉలసయ్య, ఎస్ఐ ప్రవీణ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతురాలను పరిశీలించారు. అనంతరం క్లూస్ టీం మరియు డాగ్ స్కాడ్ తో తనిఖీలు చేపట్టి సంఘటనా స్థలం నుంచి పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. మృతురాలి దుస్తులు చిందరవందరగా ఉండడం పై ఆమెపై అత్యాచారం చేసి అనంతరం చంపి పారిపోయి ఉంటాడని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హత్యవిషయం తెలుసుకున్న వైసిపి మండల అధ్యక్షుడు నాగేళ్ల సాంబశివరెడ్డి, జడ్‌పిటిసి కోకటం వెంకట భయపురెడ్డి, టిడిపి నాయకులు మబ్బు చింతలపల్లి శ్రీనాథ్ రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



హత్యకు గురైన పద్మావతి



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

రైతు సమస్యలపై మైదుకూరులో నేడు నిరసన

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

రైతు సమస్యలను పరిష్కరించేందుకు సోమవారం మైదుకూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సేవా సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎవి రమణ తెలిపారు. ఆ మేరకు ఆదివారం ఆయన మైదుకూరులో మాట్లాడుతూ కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటు చేయాలని, ఎన్నికల ప్రచార సమయంలో రైతులకు ఇస్తామన్న రైతు భరోసా రూ.20వేలు రైతులకు అందజేయాలన్నారు. ఏళ్ల తరబడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగు నీటి పథకాలు తెలుగుగంగ, రాజోలి, హంద్రీ-నీవా ప్రాజెక్టులు పూర్తి చేయాలని తెలిపారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న పలు రైతు సమస్యలను పరిష్కరించాలని నిరసన చేపడుతున్నామన్నారు. నిరసనలో రైతులు, రైతు శ్రేయోభిలాషులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు మండల నాయకులు కె.రామ్మోహన్, చెక్‌పోస్ట్ శ్రీనివాసులు, పాములేటి నరసింహ, సమితి నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు చొక్కం సంజీవ రాయుడు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - లింగాల

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1997-98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 28 ఏళ్ల తర్వాత వారు చదువుకున్న పాఠశాలలో వారి కలయిక మధురానుభూతిగా నిలిచింది. ఈ క్రమంలో ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం తమతోపాటు చదివిన గురుప్రసాద్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. పాఠశాలకు నీటి శుద్ధి యంత్రాన్ని వితరణ చేశారు. అప్పటి పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పెండ్యాల కృష్ణమూర్తికి బీరువాను అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, రామసుబ్బారెడ్డి, లక్ష్మీకాంతమ్మ, ఉపాధ్యాయులు భారతి, పురుషోత్తంరెడ్డి, బాబయ్య పాల్గొన్నారు.



ఆర్థికసాయం చేస్తున్న పూర్వ విద్యార్థులు

క్రైం కార్నర్

డ్యాంలో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - వల్లూరు

ప్రమాదవశాత్తూ ఆది నిమ్మాయిపల్లి డ్యాంలో పడి యశ్వంత్ (20) మృతి చెందాడు. మండల కేంద్రంలోని ఆది నిమ్మాయిపల్లి డ్యాంకు ప్రొద్దుటూరుకు చెందిన యశ్వంత్ స్నేహితులతో సరదాగా గడపడానికి ఆదివారం ఇక్కడికి వచ్చారు. ప్రమాదవశాత్తూ నీటి మడుగులో పడ్డాడు. స్నేహితులు గమనించి బయటకి తీసి 108 వాహనం ద్వారా చెన్నూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు డ్యామ్ వద్ద ప్రమాదక సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



మృతి చెందిన యశ్వంత్

రైలు కింద పడి వ్యక్తి..

ప్రజాశక్తి - కొండాపురం

కొండాపురం రైల్వే స్టేషన్ పంప్‌హౌస్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందాడు. రైల్వే పోలీసులు సమాచారం మేరకు అతను ఆత్మహత్య చేసుకున్నాడు.

చికిత్స పొందుతూ మరో వ్యక్తి..

ప్రజాశక్తి - తొండూరు

గత నెల 30న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు అతని కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గంగాదేవిపల్లె చెందిన గోకనపల్లి పెద్ద గంగిరెడ్డి(49) పని ముగించుకొని ఇంటికి వస్తున్న క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయనను పులివెందులలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.



నగలు, నిందితులతో డిఎస్‌పి, అధికారులు

బ్యాంకు చోరీలో దొంగలు అరెస్టు

-11 తులాల బంగారు నగలు, వ్యాన్ స్వాధీనం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

గత నెల 30న పట్టణంలోని కెనరా బ్యాంకులో జరిగిన దొంగతనం కేసులో నిందితులను అరెస్టు చేశామని జమ్మలమడుగు డిఎస్‌పి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెనరా బ్యాంకులో ఇరగంరెడ్డి సావిత్రి బ్యాంకులో కట్టెల బ్యాగుతో ఉండడం వల్ల గుత్తికి చెందిన వనార్చి అనంతమ్మ, మహేష్, గాయత్రి అను అనుమానితులను సిసి కెమెరాల ద్వారా పరిశీలించి వెతుకుతూ ఉండగా తాడిపత్రి బైపాస్ రోడ్డులో వాహనాల తనిఖీలో పట్టపడ్డారన్నారు. వీరిపై నాలుగు కేసుల నుంచి 11 తులాల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ దాదాపు రూ.8.80లక్షలు ఉంటుందన్నారు. ఓమిని కారును కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను పట్టుకోవడంలో చురుకైన పాత్ర పోషించిన అర్బన్ సిఐ లింగప్ప, ఎస్ఐ బి.రామకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ దేవదాసు, కానిస్టేబుల్ రియాజ్, నాగేంద్ర, డబ్ల్యు పిసి జ్యోతిని కలెక్టర్‌తోపాటు తాను కూడా అభినందిస్తున్నానని డిఎస్‌పి తెలిపారు.

10 మంది జూదరులూ..

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జూదరులను అరెస్టు చేసి వారి నుండి నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నామని టూ టౌన్ సిఐ యుగంధర్ తెలిపారు. పట్టణంలోని వాజ్పేయి నగర్‌లో పేకాట ఆడుతున్నారనే సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. 10 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.15,900 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

వేంపల్లెలో మరో ఐదుగురు..

వేంపల్లె: వేంపల్లె ఎస్‌సి కాలనీ సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.12,750 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమాచారం మేరకు ఆదివారం సిఐ సురేష్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎస్ఐ తిరుపాల్ నాయక్ పేకాట స్థావరంపై దాడులు చేశారు.

ఖాళీ ప్లాట్లు.. ప్రజలకు పాట్లు

ముళ్లపొదలు, విషపురుగుల ఆవాసం-పేరుకుపోతున్న చెత్తాచెదారం-పట్టని మున్సిపల్ అధికారులు



ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణంలో ఖాళీ ప్లాట్లతో ప్రజలకు పాట్లు తప్పడం లేదు. ఇక్కడ పేరుకున్న చెత్తాచెదారం నుంచి దుర్వాసన వెదజల్లుతుండడంతో స్థానికులు అవస్థ పడుతున్నారు. పట్టణంలో చాలాచోట్ల ఖాళీ స్థలాలు ముళ్లపొదలు, చెట్లు, గడ్డి పెరగడంతో విషపురుగులకు ఆవాసంగా మారాయి. ఇళ్ల మధ్య ఉన్న స్థలాల్లో చెత్త నిల్వలు పేరుకోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోతున్నారు. ఖాళీ స్థలాల్లో చెత్త వేయడం వల్ల దోమలు ఎక్కువై అనారోగ్యంతో ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోందని పరిసర ప్రాంత నివాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కంటిపై కునుకు కరువు

పట్టణంలోని ఖాళీ స్థలాల్లో మురుగు నీరు చేరి దోమలకు నిలయంగా మారుతున్నాయి. రాత్రి, పగలు కంటిపై కునుకు లేకుండాపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విష పురుగులు ఇక్కడ ఉన్న ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కల మధ్య చేరి భయాందోళనకు గురి చేస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. విష పురుగులు ఇళ్లలోకి వస్తాయేమోనని బిక్కుబిక్కు మంటూ గడుపుతున్నారు. చెత్త, మురుగు నీరు పేరుకుపోతున్నా అధికారులు స్పందించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఖాళీ స్థలాల యజమానులకు పిచ్చి మొక్కలు పెరగకుండా చూసుకోవాలని, నోటీసులు ఇచ్చి వారిని హెచ్చరించాల్సి అవసరం ఎంతైనా ఉంది. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా ఖాళీ స్థల యజమానులకు అవగాహన కల్పించి పరిశుభ్రంగా ఉంచుకునేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఫీజు చెల్లించలేదని హాల్ టిక్కెట్ ఇవ్వని స్థానిక జమ్మలమడుగు రోడ్డులో ఉన్న శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మేరీ కుమార్, విశ్వనాథ్ డిమాండ్ చేశారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ కళాశాలలో ఫీజులు చెల్లించలేదని పరీక్షల సమయంలో విద్యార్థులకు హాల్‌టిక్కెట్ ఇవ్వకుండా యాజమాన్యం వేధించకూడదన్నారు. అలా వేధిస్తే యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నా యాజమాన్యాలు ఫీజులు కట్టాలని విద్యార్థులను వేధిస్తున్నారన్నారు. ప్రభుత్వం తరుపున ఫీజు రియంబర్స్‌మెంట్ విద్యార్థులకు రాకపోతే అది ప్రభుత్వం తప్పని తెలిపారు. ఇవేవీ పట్టించుకోకుండా పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులను వేధించడం ఏమిటన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్నా ఇంతవరకు ఒక్క టర్మ్ కూడా ఫీజు రీయంబర్స్‌మెంట్ ఇవ్వలేదన్నారు. తక్షణమే శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ కళాశాల యాజమాన్యం విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా హాల్ టిక్కెట్లు ఇచ్చేలా కాలేజి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సమావేశంలో రమేష్, చిన్న, శ్రీను, వెంకటేష్, సుబ్బారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు

అధ్వానం.. సోమాపురం ఎస్‌సి కాలనీ రోడ్డు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని సోమాపురం నుంచి ఎస్సీ కాలనీకి వెళ్లే రహదారి చాలా అధ్వానంగా తయారైంది. తార రోడ్డు పూర్తిగా దెబ్బతిని కంకర రాళ్లు బయటపడ్డాయి. రహదారి వెంబడి పెద్దపెద్ద గుంతలు0 ఏర్పడ్డాయి. గతంలో మొర్రాయపల్లి, ఆనందాశ్రమం రోడ్డు నూతనంగా నిర్మించే సమయంలో ట్రాక్టర్లు, లారీలు ఈ మార్గాన అధికంగా ప్రయాణించాయి. ప్రస్తుతం గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు నిర్మాణ పనులలో భాగంగా భారీ వాహనాలు ఈ మార్గాన అధిక సంఖ్యలో ప్రయాణిస్తున్నాయి. దీంతో రోడ్డు అధికంగా దెబ్బతింది. కొన్ని ప్రదేశాలలో భారీ వాహనాల తాకిడికి కంకర రాళ్లు బయటపడి గుంతలు ఏర్పడ్డాయి. ఎస్సీ కాలనీ వాసులు రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని కోరుతున్నారు. ప్రస్తుతం వివి కోటాల మీద మైదుకూరుకు వెళ్ళవలసి వస్తుంది. సోమాపురం మీదుగా రోడ్డును ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. సచివాలయానికి, రేషన్ బియ్యానికి ఎస్సీ కాలనీ వాసులు ఈ మార్గంలో ప్రయాణించాల్సి ఉంది. రోడ్డుకు గుంతలు లేకుండా చూడాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



అధ్వానంగా తయారైన రహదారి

మద్యం జోరు.. భక్తుల పరేషాన్



మఠంలో మద్యం మత్తులో రోడ్డుపై పడి ఉన్న వ్యక్తి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

బ్రహ్మంగారిమఠం మండలంలో ప్రతి గ్రామాన బెల్ట్ షాపులు జోరుగా కొనసాగుతున్నాయి. పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీశ్రీశ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి సజీవ సమాధి నిష్ఠ వహించిన మఠంలో మద్యం అమ్మకాలు జోరుగా ఉన్నాయి. పుణ్యక్షేత్ర ప్రాంతానికి 7 కిలోమీటర్ల దూరంలో స్థానికంగా ఉండే కొందరు బెల్టు షాపులు నిర్వహిస్తూ అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. గతంలో మండలానికి ఒక లైసెన్స్ షాపు మాత్రమే మద్యం దుకాణం ఉండేది. నేడు కూటమి ప్రభుత్వ అధికారంలోకి రాగానే మండలంలో రెండు లైసెన్సు షాపులో అందుబాటులోకి తెచ్చారు. బెల్ట్‌షాపులు, అధిక ధరలకు మద్యం విక్రయాన్ని అరికట్టవలసిన ప్రభుత్వాలే వాటిని పెంచడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా తయారయ్యాయి. అరికట్టవలసిన అధికారులు చోద్యం చూస్తున్నారు. పవిత్ర పుణ్యక్షేత్రమైన వీరబ్రహ్మేంద్ర స్వాముల వారిని దర్శించుకునేందుకు వివిధ రాష్ట్రాల నుండి భక్తులు అధిక సంఖ్యలో వస్తూ ఉంటారు. మద్యం మత్తులో పలువురు రోడ్లపై పడిపోయి ఉండడంతో భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి. అంతేకాక వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా చెప్పినప్పటికీ కిందిస్థాయిలో అధికారులు వాటిని అమలు చేయడంలో చిత్తశుద్ధి చూపడంలేదనే విమర్శలున్నాయి. ముఖ్యమంత్రి మాటే లెక్క చేయకుండా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నా.. అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బాలోత్సవంలో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో డ్రాయింగ్ మాస్టర్ సురేష్‌కుమార్

ప్రజాశక్తి - వేంపల్లె

కడప నగరంలో నిర్వహించిన బాలోత్సవ పోటీల్లో బాలుర పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు డ్రాయింగ్ మాస్టర్ సురేష్ కుమార్ తెలిపారు. బాలోత్సవ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన చిత్రలేఖనం, కోలాటం, మట్టి బొమ్మల తయారీ పోటీల్లో ధనుంజయ, ఫజిల్, హమీద్, రామ చరణ్, భువనేశ్వర్, శ్రీఆంజనీయ, విజయసింహ, మల్లికార్జున విద్యార్థులు ప్రతిభ చూపారు. వీరికి సర్టిఫికెట్లుతోపాటు బహుమతులు అందజేసినట్లు ఆయన వివరించారు. తమ విద్యార్థులు ప్రతిభ చూపడంపై ప్రధానోపాధ్యాయురాలు శివమునెమ్మ, ఉపాధ్యాయులు లత, మస్తాన్‌వలి, ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.

రెయిన్ బో పాఠశాల విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి - ఖాజీపేట

కడప పట్టణంలో రెండు రోజులుగా జరిగిన బాలోత్సవం కార్యక్రమంలో స్థానిక రెయిన్‌బో పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించారు. బాలోత్సవ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పిల్లల పండుగ కార్యక్రమంలో 11 అత్యధిక బహుమతులు సాధించారు. ఇవి తమ విద్యా సంస్థలకు గర్వకారణమని ఆ పాఠశాల కరస్పాండెంట్ తవ్వా సుధా కర్‌రెడ్డి తెలిపారు. వివిధ పోటీ పరీక్షలు, సైన్స్ ప్రయోగ విభాగంలో బహు మతులను అందుకున్న బిందుశ్రీ, సంతోష్‌రెడ్డి, వాణి, అస్మి సాహిత, చైతన్య, ఆఫ్రిన్ సుల్తానా లక్ష్మీప్రణతి, అసిఫ్, అభిరామ్, ఆర్పినా, షేక్ కాదియా బహు మతులు గెలుపొందారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం విజేత లను ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బహుమతులతో రెయిన్ బో విద్యార్థులు

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

వాహనదారులు రహదారి భద్రత పాటించాలని సిఐ దస్తగిరి పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక పాత బస్టాండ్ కూడలిలో సిఐ ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ వేగం కన్నా ప్రాణం మిన్న అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే శిక్షార్హులు అవుతారన్నారు. బైక్ నడిపేవారు హెల్మెట్, కారులో వెళ్లేవారు సీట్‌బెల్ట్ తప్పక ధరించాలన్నారు. చిన్నపిల్లలకు బైక్‌లు ఇవ్వరాదన్నారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను దగ్గరే ఉంచుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్.పి ఇజి అశోక్ కుమార్

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు కీలకం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు కీలకమని ఎస్‌పి ఇజి అశోక్‌కుమార్ తెలిపారు. ఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన అశోక్ కుమార్ ఆదివారం ఎర్రగుంట్ల పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసులకు పలు సూచనలిచ్చారు. అసాంఘిక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో సిఐ నరేష్ బాబు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.డిఎస్‌పి వెంకటేశ్వర్లు ఆదివారం పోలీస్‌స్టేషన్ తనిఖీ చేశారు. మూడు వారాల ట్రైనింగ్ నిమిత్తం డిఎస్‌పి భవాని శనివారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. కదిరి పట్టణానికి చెందిన ఆమె గ్రూప్-1లో డిఎస్‌పిగా ఎంపికయ్యారు.



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

టిడిపి ప్రభుత్వంలోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

2029లో మళ్లీ చంద్రబాబు అధికారం చేపడతారని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తుగుట్ల మధుసూదన్‌రెడ్డి తెలిపారు. తన నివాసంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లో పులివెందులలో కొన్నేళ్లుగా జరుగుతున్న మట్కాను నిషేధించిందన్నారు. ఉచిత ఇసుక, మైనింగ్ అక్రమ రవాణా కాకుండా అడ్డుకట్ట వేసిందన్నారు. 2014లో పులివెందులలో నీటి సమస్య ఎక్కువ కావడంతో అప్పటి టిడిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే పులివెందుల ప్రాంత టిడిపి నాయకులు ఈ ప్రాంతానికి నీరు వచ్చేలా చేయాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళితే సత్వరమే రూ.కోటి వెచ్చించి రైతుల నీటి కష్టాలు తీర్చారన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి నాయకులు దోచుకున్నారే తప్ప, ప్రజలకు చేసిందేమీలేదన్నారు. పులివెందులకు మళ్లీ నీటి కష్టాలు తప్పలేదన్నారు. ఈ నేపథ్యంలో 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నక్కపల్లి డ్యామ్‌లో నీటి పైపులైన్ లీకేజీ పనుల కోసం రూ.50 లక్షలు వెచ్చించారన్నారు. తాము చెప్పిన ప్రతి పథకం తప్పకుండా దశలవారీగా అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సుబ్బారెడ్డి, అంకాల్ రెడ్డి పాల్గొన్నారు.



వాహనాలు రాకుండా రోడ్డుకు అడ్డుపెట్టిన కంప, రాళ్లు

భారీ వాహనాల రాకపోకల అడ్డగింత

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో మట్టిని తీసుకెళ్తున్న భారీ వాహనాల రాకపోకలను ఆ గ్రామస్తులు ఆదివారం అడ్డుకున్నారు. వీటివల్ల రోడ్లు, పంటలు దెబ్బతింటున్నాయని కొత్తపల్లె ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఎర్రబల చెరువు నుంచి ఇతర ప్రాంతాలకు మట్టిని తరలిస్తూ కొత్తపల్లి గ్రామం మీదుగా భారీ వాహనాలు వెళుతున్నాయి. రోడ్లు, సాగు చేసిన అరటి పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయని వారు వాపోతున్నారు. వారం రోజుల క్రితం వేసిన తారు రోడ్డు భారీ వాహనాలు రావడంతో రోడ్డంతా పగిలిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ వాహనాలు మట్టి వేసుకొని వస్తుండడంతో రోడ్లపై ఉన్న మట్టి అంతా అరటి గెలలకు చుట్టుకుంటోందని, దీంతో అరటి గెలలు వృద్ధి చెందడం లేదని రైతులు వాపోతున్నారు. భారీ వాహనాలు గ్రామంలో వెళ్లకుండా స్థానికులు రోడ్డుపై ముళ్లచెట్లు, రాళ్లను అడ్డుపెట్టారు. సంబంధిత అధికారులు కూడా భారీ వాహనాలు రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సిఐ మోహన్

ఆటో డ్రైవర్లు నిబంధనలు తప్పక పాటించాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని, వాటిని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని స్థానిక సిఐ మోహన్ హెచ్చరించారు. ఆదివారం పోలీస్‌స్టేషన్ కార్యాలయంలో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.. తమ వాహనాలకు తప్పక నెంబర్‌ను కలిగి ఉండాలన్నారు. పోలీస్ నెంబర్‌లేని ఆటోలపై చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రి సమయాల్లో ఆటోడ్రైవర్లకు ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు. ఆటోలో ప్రయాణించే ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. హేళనగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయని సిఐ హెచ్చరించారు.